క్లుప్తంగా

సాహిత్య స్ఫూర్తి 'కనుగుల'



ప్రసంగిస్తున్న గార రంగనాథం

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్యానికి ఎంతో విలువనిచ్చే వ్యక్తి కనుగుల వెంకటరావు అని రాజాం రచయితల సంఘం అధ్యక్షుడు గార రంగనాథం అన్నారు. శ్రీకాకుళంలోని రెడ్‌క్రాస్ కమ్యూనిటీ భవన్‌లో వేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత కనుగుల వెంకటరావు 94వ జయంతి ఉత్సవం డాక్టర్ కె.సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ రచయితలకు స్ఫూర్తిగా వెంకటరావు నిలుస్తారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.చంద్రశేఖర్, దుప్పల రవికుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, రచయితలు పిల్లా తిరుపతిరావు, కొత్తకోట పోలినాయుడు, డాక్టర్ కోమలరావు, బలివాడ మల్లేశ్వరరావు, సురంగి మోహనరావు, కాశీపట్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్‌కు అభినందనలు



సుశాంత్‌ను అభినందిస్తున్న డైరెక్టర్, ప్రిన్సిపాల్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థి నంబాల సుశాంత్ క్రికెట్‌లో అత్యుత్తమంగా రాణిస్తున్నాడు. ఇటీవల చండీగఢ్ ఐఎస్ బింద్రా మైదానంలో నిర్వహించిన వినుమన్కడ్ ట్రోఫీ -2024లో చండీగఢ్ జట్టుపై ఆంధ్రా జట్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 53 పరుగులు చేసి కీలకంగా వ్యవహరించాడు. ఈ సందర్భంగా సుశాంత్‌ను కళాశాల డైరెక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, ప్రిన్సిపాల్ రమణమూర్తినాయుడు గురువారం అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



నిత్యావసర సరుకులు అందిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల: లావేరు మండలం సహపురం గ్రామానికి చెందిన బోర ముసలయ్య పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేత పిన్నింటి సాయికుమార్ గురువారం పరామర్శించి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం ప్యాకెట్, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బోర సాయిరాం, సహపురం సర్పంచ్ దారపు రంగారావు, నాయకులు బోర అసిరినాయుడు, నగిరెడ్ల అప్పలరాజు, నగిరెడ్ల రమణ, నాగార్జునరెడ్డి, మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్.జి.రంగా విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: గాంధేయవాదిగా స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఆచార్య ఎన్జీ రంగా రైతు కూలీల కోసం జీవిత పర్యంతం గళమెత్తి రైతు బాంధవునిగా పేరు గాంచారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల సంఘ సంస్కర్తల స్మృతివనంలో విగ్రహదాతలు, మాజీమంత్రి త్రిపురాన వెంకటరత్నంతో కలిసి రంగా విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అవధాన పండితులు పైడి హరనాథరావు ఎన్జీ రంగా గొప్పతనాన్ని కీర్తిస్తూ గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, పొన్నాడ రవికుమార్, పందిరి అప్పారావు, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, మహిబుల్లాఖాన్, ఎంవివిఎస్ శాస్త్రి, పెంకి చైతన్య, టిక్కం రాంగోపాల్, టీడీపీ నాయకులు రొక్కం భాస్కర్, రౌతు సంతోష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రణస్థలంలో శోభాయాత్ర

రణస్థలం: కోష్ట గ్రామంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం, గోసేవా ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 8న రణస్థలం మండల కేంద్రంలో జగన్నాథ స్వామి శోభాయాత్ర (రథయాత్ర) నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి అనంతరం వచ్చే అష్టమి(గోపాష్టమి) నాడు గోవులను పూజిస్తే సకల శుభాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 9న గోసేవా ఆశ్రమంలో సుదర్శన హోమం, అన్న సమారాధన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తుల ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇదేం తీరు?

- సర్పంచ్ హక్కులను కాలరాస్తున్న కూటమి సర్కారు
- ఎన్ఆర్ఈజీఎస్ పనులకు మోకాలడ్డుతున్న వైనం
- ప్రేక్షక పాత్రలో అధికారులు



సర్పంచ్‌లకు మెటీరియల్ కాంపొనెంట్ పనులు అప్పగించాలని వినతి పత్రం ఇస్తున్న రణస్థలం మండల సర్పంచ్‌లు(ఫైల్)

రణస్థలం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్పంచ్ వ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని అడ్డగోలుగా విమర్శలు చేసి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు.. కూటమి ప్రభుత్వంలో సర్పంచ్‌ల హక్కులకు మంగళం పాడేస్తున్నారు. ఇప్పటికే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడం, వలంటీర్ వ్యవస్థను కనుమరుగు చేయగా.. తాజాగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు చేయనివ్వకుండా వాటిని కూటమి కార్యకర్తలకే అప్పగిస్తూ సర్పంచ్ హక్కులకు తూట్లు పొడుస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు.

వెండర్స్‌కు కేటాయింపులా?

సర్పంచ్ వ్యవస్థలను విస్మరించి గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి పార్టీల నాయకులు అడ్డగోలుగా విమర్శించేవారు. అదే కూటమి పార్టీలు అధికారంలోనికి రాగానే మాటమార్చాయి. ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపొనెంట్ పనులను ప్రభుత్వం వెండర్స్‌కు కేటాయిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జన్మభూమి కమిటీల తరహాలో ప్రైవేటు వ్యక్తులకు పనుల్లో ప్రమేయం కల్పించడం చట్టరీత్యా నేరమని, ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్‌లను పక్కన పెట్టి కూటమి కార్యకర్తలకు అప్పగించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదే జరిగితే ఎన్ఆర్‌జీఎస్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేసినట్లేనని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాభివృద్ధిలో భాగమైన సర్పంచ్‌లకు కూటమి ప్రభుత్వం అధికారంలోని రాగానే సముచిత గౌరవం కల్పిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్న మాటలను నిలబెట్టుకుని పనుల బాధ్యతలను వెండర్స్‌కు అప్పగించడాన్ని రద్దు చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

సర్పంచ్‌లకే కేటాయించాలి



ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్‌లను కాదని జన్మభూమి కమిటీల తరహాలో అర్హత లేని కూటమి కార్యకర్తలకు ఎన్ఆర్ఈజీఎస్ పనులు అప్పగించడం విడ్డూరంగా ఉంది. గత నెల 18న జరిగిన సర్వ సభ్య సమావేశంలో సర్పంచ్‌లకే ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపొనెంట్ పనులు ఇవ్వాలని తీర్మాణం చేశాం. అయినా పట్టించుకోలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే సర్పంచ్‌లంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుంది.

– పిన్నింటి సాయికుమార్, వైఎస్సార్ సీపీ నేత, రణస్థలం ఎంపీపీ ప్రతినిధి

సర్పంచ్‌లకు విలువ లేదా?



ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపొనెంట్ పనులను గ్రామాల్లో అర్హత లేని కూటమి కార్యకర్తలకు ఇవ్వడం వల్ల పంచాయతీలో అభివృద్ధి పక్కదారి పడుతుంది. నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటాయి. గ్రామ అభివృద్ధిని కాంక్షించే ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు. వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టాలంటే సర్పంచ్‌లకే మెటీరియల్ కాంపొనెంట్ పనులు ఇవ్వాలి.

– మీసాల రామారావు, దేరసాం సర్పంచ్

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..



ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపొనెంట్ పనులను ప్రస్తుతం వెండర్స్‌కు పిలిచి అప్పగిస్తున్నాం. సర్పంచ్‌లకు ఇవ్వాలా లేదా అనే అంశంపై ఉన్నతాధికారులను అడిగి తదుపరి చర్యలు తీసుకుంటాం, గతంలో కూడా పంచాయతీ తీర్మానం ప్రకారమే వెండర్స్ అప్పగించాం.

– ఈశ్వరరావు, ఎంపీడీఓ, రణస్థలం

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



శ్రీకాకుళం అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ ప్రతినిధులు, విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని క్యాన్సర్ శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ బమ్మిడి సందీప్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో సిద్దార్థ హై స్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సందీప్ వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముని శ్రీనివాసరావు, కార్యదర్శి దూసి సంతోష్, సిద్ధార్థ హైస్కూల్ కరస్పాండెంట్లు నాతాడ వెంకటరావు, ఎం.నరసింహమూర్తి, రోటరీ ప్రతినిధులు బరాటం శ్రీనివాస, కిల్లాన శ్రీనివాసరావు, జైశ్రీరామ్, పసగడ సూర్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కనుగుల సుధీర్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ పరిపాలనా విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే వ్యాధిని జయించవచ్చన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, చిన్మయరావు, ఏవో నర్సింగరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, పీఆర్‌ఓ పెంకి చైతన్యకుమార్, బి.సతీష్, గుణాకర్, ఏపీఆర్‌వో ఉమాశంకర్, ప్రతినిధులు హర్ష, సుజాత, వెంకటరమణ, యోగా రామారావు, అరుణ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: పెంట గ్రామంలో క్యాన్సర్‌వ్యాధిపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి రాకుండా అనుసరించాల్సిన విధానాలను వైద్యులు వివరించారు. జి.సిగడాం, బాతువ, డీఆర్‌వలస, సంతవురిటి తదితర గ్రామాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, సర్పంచ్‌లు పున్నాన అక్కలనాయుడు, శ్రీనివాసరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కనుగుల సుధీర్



జి.సిగడాం: పెంట గ్రామంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భవానీ, సుభాషిణి

పలకలిలా.. రాకపోకలెలా?



శ్రీకాకుళం నగరంలో భారతీనగర్, హడ్కోకాలనీకి ఆనుకుని ఉన్న కాలువపై పలకలు ప్రమాదకరంగా మారాయి. ద్విచక్ర వాహనాల వెనుక కూర్చున్న వారు ఈ ప్రదేశం వద్దకు వచ్చేసరికి కిందపడి గాయాల పాలవుతున్నారు. కాలేజీలతో పాటు రామాలయం, శివాలయం, భద్రమ్మతల్లి దేవాలయాలు ఉండటంతో నిత్యం ఈ ప్రదేశం రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి పలకలు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ప్రమాదమని తెలిసినా..



జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రయాణాలు కొనసాగుతున్నాయి. ట్రక్కులు, ట్రాక్టర్లు ఇతర వాహనాలపై నిలబడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వాహనం పంక్చరైనా, ఎటువంటి చిన్న ప్రమాదానికి గురైనా పెను నష్టం తప్పదు. శుభకార్యాలు, కూలి పనులకు, ఇతర సభలకు వెళ్లేటప్పుడు ఈ రకమైన ప్రయాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాలు జరగకముందే వీటిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

గోతులతో పాట్లు



శ్రీకాకుళం–రాజాం ప్రధాన రహదారిలో వాంద్రంగి రైల్వే వంతెనపై భారీగా గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలు కూడా వెళ్తుండటంతో గోతులు రోజురోజుకూ మరింత పెద్దవిగా తయారై ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

మేల్కొనకపోతే ముప్పే..



ఎచ్చెర్ల మండల పరిధిలో చిలకపాలెం, బైపాస్, ఎచ్చెర్ల, అరిణాం అక్కివలస వంటి ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు. వీటి గోడల్లో రావి, మర్రి వంటి మొక్కలు పుట్టుకొస్తున్నాయి. ఇవి పెరిగే కొద్దీ గోడలకు ముప్పు తప్పదు.సంబంధిత అధికారులు ముందే మేల్కొని మొక్కలు తొలగిస్తే భవిష్యత్తులో సమస్యలు రావని వాహనచోదకులు చెబుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

సమాంతర వ్యవస్థ సరికాదు

- నగర టీడీపీ సమావేశంలో పలువురు వార్డు ఇన్‌చార్జిల ఆవేదన

శ్రీకాకుళం: నగరంలోని అన్ని వార్డుల్లోను వార్డు ఇన్‌చార్జిలు కాకుండా మరికొందరు పార్టీ పేరు చెప్పుకుని తిరుగుతున్నారని, ఇలా సమాంతర వ్యవస్థ నడపడం సరికాదని పలువార్డుల ఇన్‌చార్జిలు ఎమ్మెల్యే గొండు శంకర్ ఎదుట వాపోయారు. జిల్లా పార్టీ కార్యాలయంలో వార్డుల విభజన అనే అంశాన్ని వివరించేందుకు ఎమ్మెల్యే నగరపార్టీ వార్డు ఇన్‌చార్జిలు, మరికొందరు నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. నగర ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు తన భూమికి 1బీ రావడం లేదని ఎవరితో చెప్పినా ఫలితం లేకపోయిందని వాపోయారు. 1983 నుంచి పార్టీ వెన్నంటి ఉన్నానని, మీరు ఎమ్మెల్యే టిక్కెట్‌కు ప్రయత్నిస్తుండగా తొలిగా మీ వెంట నడిచిందని తమ కుటుంబమేనని, మేమే లేకపోతే మీ పరిస్థితి ఏంటని నిలదీశారు. పార్టీ తమవంటి సీనియర్లను పట్టించుకోకపోతే ఇంకెందుకని ప్రశ్నించారు. ఇలిసిపురం వార్డు ఇన్‌చార్జి గండేపల్లి కోటీశ్వరరావు, దమ్మలవీధి వార్డు ఇన్‌చార్జి కమల మాట్లాడుతూ వార్డుల్లో జరిగే కార్యక్రమాలకు పార్టీ నుంచి సమాచారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అంతకుముందు దమ్మలవీధిలో దీపం పథకాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వెళ్లగా అక్కడ మహిళలు తాగునీరు, మరికొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ఏకరువు పెట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే నోరుజారి ఓ మాటా అనడంతో వివాదం నెలకొంది. ఆ పదాన్ని ఎమ్మెల్యే ఉపసంహరించుకుని మహిళలకు సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

స్టాంప్‌డ్యూటీ బిల్లులు ట్రెజరీకి పంపాలి



రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చిన సర్పంచ్‌లు

ఎచ్చెర్ల : లావేరు మండల సర్పంచ్‌లకు బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రణస్థలం ట్రెజరీకి బిల్లులు పంపాలని పలువురు సర్పంచ్‌లు గురువారం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా రిజిస్ట్రార్ నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బిల్లు వచ్చి చాలారోజులు అవుతున్నా ఇంతవరకూ గ్రామ పంచాయితీలకు బిల్లులు పడలేదని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చాంద్ బాషా తెలిపారు. నిధులు లేక గ్రామాల్లో కనీసం పారిశుధ్య పనులు కూడా చేయించలేకపోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దాశెట్టి తిరుపతిరావు, నాయన పైడిరెడ్డి, పెయ్యిల లక్ష్మణరావు, దుర్గాశి ధర్మారావు, శాంతాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గార: మండల పరిధిలో చల్లపేట, కళింగపట్నం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పైడి యోగీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చల్లపేట, గొంటి, బలరాంపురం, రామచంద్రాపురం, వాడాడ, వప్పంగి, కళింగపట్నం, కె.మత్స్యలేశం, బందరువానిపేట పంచాయతీలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం, కొయ్యాం, కె.కె.నాయుడుపేట, డి.మత్స్యలేశం, కుప్పిలి, బడివానిపేట, భగీరథపురం, పొన్నాడ, ముద్దాడ, కుశాలపురం, ఫరీదుపేట, కేశవరావుపేట, కొత్తపేట, దోమాం, వెంకన్నగారిపేట, తెప్పరేవు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని ఈఈ పేర్కొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి అందరి సహకారం అవసరం



హైర్ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో 2వ డిపో పరిధిలో శ్రీకాకుళం నుంచి పలాస వెళ్లే కొత్త పల్లె వెలుగు (హైర్)బస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పురోగతిలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్, 1, 2వ డిపో మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, స్టేషన్ మేనేజర్ ఎం.పి.రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు శ్రీను, శిమ్మయ్య, పి.ఆర్.ఓ. కె.సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజుల పనిదినాలపై అవగాహన



సచివాలయం వద్ద ఉపాధి ముగ్గు

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 100 రోజులు పని కల్పించడంపై ఫరీదుపేట గ్రామ సచివాలయం వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో శోభాదేవి మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి ఏడాదిలో 12 నెలల్లోనూ వంద రోజుల పని కల్పిస్తామని చెప్పారు. ప్రధానంగా ఏప్రిల్‌లో 20 రోజులు, మేలో 21 రోజులు పని కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి హరికథా కాలక్షేపాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు సరస్వతీ సంగీత విద్యానిలయం, శ్రీకాకుళం మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ, మావుడూరి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మావుడూరి సత్యనారాయణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 8న రామచంద్రాపురానికి చెందిన యండమూరి శిఖామణి భాగవతారిణిచే 'పార్వతీకల్యాణం', 9న విశాఖకు చెందిన బొంతలకోటి యతిరాజు భాగవతార్‌చే 'ప్రమీలార్జనీయం', 10న ఏలూరుకు చెందిన సప్ప భారతి భాగవతారిణిచే 'శివలీల' అనే హరికథ ప్రదర్శనలు జరుగుతాయని, అభిమానులు పాల్గొనాలని కోరారు.

14న పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష అధికారులు

రణస్థలం: ఈ నెల 14న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏపీవో కె.నళినీకాంత్, సీఎంవో ప్రభాకరరావు తెలిపారు. రణస్థలం ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం ఎంఈవోలు, సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపార్ కార్డు, విద్యార్థి చదువు, సామర్థ్యం, పాఠశాల మౌలిక వసతులపై చర్చించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు విధిగా హాజరయ్యేలా సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు చొరవతీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 బి.లావణ్య, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామభజన



భజన చేస్తున్న భక్తులు

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ అంబటివానిపేట రామమందిరం వద్ద కార్తీక మాసం సందర్భంగా గురువారం వేకువజామున హరేరామ, హరేకృష్ణ నామసంకీర్తన నిర్వహించారు. రామమందిరంలో పూజలనంతరం వీధుల్లో భజన గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి పూజలు



పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గార: మండలంలోని బూరవెల్లి గ్రామంలో గురువారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా గ్రామస్తులు పుట్టల వద్ద పూజలు చేశారు. కార్తీక మాసంలో నాగుల చవితి రోజు కాకుండా తర్వాత వచ్చే షష్టి నాడు పుట్టల వద్ద పూజలు చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. గురువారం కుటుంబ సభ్యులంతా కలిసి నాగదేవతకు పాలు, గుడ్లు, నువ్వులు, బెల్లం కలిపిన ప్రసాదాన్ని సమర్పించారు.

బాబా ఆలయానికి భక్తుల తాకిడి



ఆలయం వద్ద భక్తులు

జి.సిగడాం: కార్తీకమాసం మొదటి గురువారం సందర్భంగా ఆనందపురంలోని షిరిడీ సాయి బాబా ఆలయం, వంద అడుగుల వెంకట సాయికోటి మహాస్థూపం వద్దకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా సాయినామ స్మరణతో ఆ ప్రాంతం హోరెత్తింది. గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త మక్క వెంకటి సాయి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



కార్తీక పూజలో పాల్గొన్న భక్తులు

ఎచ్చెర్ల : కార్తీకమాసం సందర్భంగా మురపాక గ్రామంలోని నరేంద్రస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఇంటింటా కార్తీక పూజలు, పురాణ కాలక్షేపం నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మికత పెంపొందించే కార్యక్రమంలో భాగంగా గురువారం వండానవారి వీధిలో కార్తీక ప్రవచన కార్యక్రమం జరిగింది. పలువురు భక్తులు పాల్గొన్నారు.